
# కొత్తకథ

కె.యస్.వై.పతంజలి



"మీ నడక తెలుగు కథానికలాగా ఎంతో బావుంది" ఆ అబ్బాయి జానకి ఎదురుగా నిలబడి అన్నాడు.

"ఈ సంగతి చెప్పటానికే నేమిటి నన్ను నిలబెట్టమన్నారు?" జానకి ఆశ్చర్యంగా అన్నది.

"నా పేరు చిరంజీవి డిగ్రీ కాకరపువ్వొత్తులు వెలగబెడుతున్నాను." చిరంజీవి తనను పరిచయం చేసుకున్నాడు.

"మీలాగే మీ పేరు కూడా బావోలేదు ...." జానకి వ్యాఖ్యానించింది.

చిరంజీవి గాభరా పడ్డాడు. 'నో...నో...మీరు అన్నట్టు నా పేరు అట్టే బావుండక పోయినా.... నేను బావుంటాను. ఇప్పుడు సాయంత్రం అవటం వలనా, వీధి దీపాలింకా వెలగక పోవడం వలనా నా మొహం మీకు సరిగ్గా కనిపించడంలేదు కామోసు. నిజం కావాలంటే మా యింట్లోని నిలువుటద్దాన్ని అడగండి..' అంటూ ఆగేడు.

"నన్ను ఇప్పుడు ఏం చెయ్యమంటా రయితే?" జానకి అర్థంకాక అడిగింది.

"మీరు ఇప్పటి కిప్పుడు అర్జంటుగా నన్ను ప్రేమించినవసరం లేదు. అసలు సంగతి.... నిన్న మీరు "ప్రిన్సిపల్-లింగమూర్తి" సినిమాకు వెళ్ళేరా? ఏం? వెళ్తూ వెళ్తూ దార్లో కిళ్ళీకొట్టు దగ్గర నుంచున్న నాకేసి వంగుని మరీ చూసేరు. అప్పుడు

మీ కళ్ళు ఎంచక్కా నవ్వుతూ వున్నయ్. ఆ మీద నేను పరిగెట్టుకుని మా యింకి వెళ్ళి ఒక్కుణ్ణీ రావటానికి జంకేసి మా రూమ్మేటు వెధవని తీసుకొని సినిమా కొచ్చి మీ వెనుక వరసలో కూర్చున్నాం. ఇంటర్వెల్‌లో మీరు కోకాకోలా తాగేరు. తప్పదు కనుక మేంవూ.తాగేం.... ఆ మీద సినిమా అయిపోయిన తరువాత మీరు రిక్షాలో వెళ్ళిపోయేరు. దానికేం మీ దగ్గర డబ్బులున్నయ్ కనుక మీరు వెళ్లిపోయేరు. మరి మా దగ్గర వున్న డబ్బులన్నీ అప్పటికే అయిపోయాయి. కనక మేం నడిచి తిరిగిపోవలసి వచ్చింది. చిరంజీవి చెబుతూనే వున్నాడు,

"ఇంకా చాలా పెద్దకథే వున్నట్టుంది. సీరియల్‌మాదిరి మిగతాది రేపో, ఎల్లుండో తీరికగా చెబుదురుగాన్లెండి" జానకి విసుగ్గా ముందుకు కదిలింది.

"ఆఁ ఆఁ ఆఁ అయిపోయిందయిపోయింది. రెణ్ణిముషాలింకా నిలబడండి. మీనుంచేకదా మాకు అన్ని డబ్బులు ఖర్చయిపోయాయి. అయినా నేను నిన్న సినిమాకి ఖర్చుపెట్టిన డబ్బులు నావి కాదు. మా రూమ్మేటువి. అంచేత డబ్బులు ఇప్పుడు ఇస్తేగాని వీల్లేదని వాడు అదిగో అల్లామూడో టెలిఫోన్ స్తంభం ప్రక్కదుక్కలాగ నించున్నాడు. వాడికి యివ్వడానికి నా దగ్గర డబ్బులు కూడా లేవు. అందువలన ఎలానూ ముందు ముందు మనిద్దరికి యిచ్చిపుచ్చుకోవడాలు జరుగుతాయి కనుక మీ దగ్గరేమున్నా డబ్బులుంటే సర్దుబాటు చెయ్యాలి. అప్పు. మళ్లీ నాకు అందగానే ఇచ్చేస్తాను. ఏమంటారు" చిరంజీవి వ్యవహార రీత్యా నవ్వాడు.

జానకికి నవ్వొచ్చింది. పంటిమాటున నవ్వుని నొక్కిపట్టి మొహం సీరియస్



చేసుకుందుకు ప్రయత్నించింది, కాని మసకచీకటిలో కనబడదని గ్రహించి మానుకుంది, తరువాత-

క్రొత్తగా నవల రాసి "ఏ సినిమా వెళ్ళవన్నా" తీసుకోడా అని సినిమా నిర్మాతలకోసం వెతుకుతున్న రచయిత్రిలా ఇటూ, అటూ చూసింది——

వారపత్రికల్లో మగాడి సీరియల్‌లాగా అక్కడా అక్కడా ఒకరిద్దరు తప్పించి మరెవరూ వీధిలో తిరగడంలేదు. కొంచెం సేపు ఆలోచించింది-చిరంజీ, "మా ఇంటికి రారాదూ...మా నాన్నార్ని అడిగి ఇస్తాను" అన్నది.

చిరంజీవి ఆలోచించాడు. "పోన్లెండి ...మీ దగ్గర ప్రస్తుతానికి లేనట్టున్నయ్. ఈసారికి మరెక్కడన్నా ప్రయత్నిస్తా న్లెండి....వస్తాను" అని చెప్పి వెనక్కి తిరిగి గబగబా వెళ్ళిపోయాడు

జానకి ఇంటికి వెళ్ళి భోజనం చేసి మంచంమీద దిండుపెట్టు వేసుకుని కూచుని పుస్తకం తీసింది

తీసింతరువాత ఆ పాపకి చిరంజీవి జ్ఞాపకం వచ్చి నవ్వుకుంది. తరువాత అటు వంటి ఉద్యోగుల విషయంలో జాగ్రత్తగా వుండాలనీ, అసలే నవ్వకూడదనీ నిశ్చయించుకుని నిద్రపోయింది

మరునాటి సాయంకాలం చిన్న పని మీద టౌన్లోకి వెళ్ళవలసి వచ్చి రిక్షాలో కూర్చుని కొంతదూరం వెళ్ళింది.

మళ్ళీ కిళ్ళీకొట్టు దగ్గర చిరంజీవి [ఉత్త రాల శీర్షికలో సీరియల్ రచయితలాగా]

అటుకేసి చూడకూడదనీ, చూసినా నవ్వకూడదనీ, నిర్ణయించుకుని తలవంచు కుని ఒక్కో చేతికి ఎన్నేసి వ్రేళ్ళున్నాయో, ఒక్కో వ్రేలికీ ఎన్నేసిగోర్లున్నాయో లెక్కపెట్టింది, లెక్కపెట్టి తరువాత వెనక్కి చూసింది.

చిరంజీవి స్పీడుగా [మాజీ ముఖ్య మంత్రి నరసింహారావుగారు ఢిల్లీకి పయన మయిన చందంగా] వెనక్కి వెళుతున్నాడు.

జానకి చిరునవ్వు నవ్వి రిక్షా మళ్ళీ వెనక్కి త్రిప్పమన్నది. రిక్షావాడు మాటాడ కుండా త్రిప్పేడు.

రిక్షా, నడుస్తున్న చిరంజీవి ప్రక్కకి వచ్చిన తరువాత రిక్షా ఆపమని, జానకి పిల్చింది.

"ఏమండోయ్!"

చిరంజీవి గాభరా పడిపోయి ఆగి, వెనక్కి తిరిగాడు.

"నేనిప్పుడు సినిమాకి వెళ్ళడం లేదు. మీరు రూముకెళ్ళి అనవసరంగా ఈ మారు ఇంకెవరి డబ్బులో అప్పుతీసుకుని ఖర్చు పెట్టే నవసరంలేదు. ఏం! అది చెప్ప టానికే పిలిచాను" జానకి చిన్నగా నవ్వింది.

చిరంజీవి సీరియస్ అయిపోయాడు,

"వాటీజ్ దిస్. ఏమిటి మీ ఉద్దేశ్యం ...

మీరు సినిమాక్కాకపోతే సర్కస్ కి వెళ్ళండి. సర్కస్ చూడటానికి కాకపోతే చేయడానికి వెళ్ళండి, మధ్యన్నాకేమిటి? వాటీజ్ దిస్..." అన్నాడు కోపంగా.

జానకి మరోసారి కొంచెమే నవ్వి రిక్షా వెనక్కి తిప్పమన్నది. రిక్షావాడు నవ్వుకుని మళ్ళీ రిక్షా వెనక్కి తిప్పాడు.

"ఏమండోయ్!" ఈమారు చిరంజీవి పిలిచాడు. జానకి వెనక్కి తిరిగింది.

"థేంక్స్.... శ్రమ తగ్గించారు.... వేగిరం వెళ్ళిపోచ్చీయండి" అన్నాడు నవ్వుతూ.

మరో నాలుగు రోజులు పోయిన తర్వాత–

జానకి ఒక్కర్తే గుమ్మందగ్గర నిలుచుంది.

ప్రక్కింటి ఆరేళ్ళ కుర్రాడొకడు మెట్ల ప్రక్క నిల్చొనున్నాడు.

వీధి మరుపుతిరుగుతూ చిరంజీవి కనిపించాడు.

"ఒరే చిట్టీ! నువ్వు రాళ్ళు విసిరి కాకుల్ని వాట్నీ కొట్టగలవేరా?" జానకి కుర్రాడి నడిగింది.

"కొట్టగలను గాని... కాకులు మనసూటుకి బాగా అందవు. పేష్టార్లు వాళ్ళు అయితే బాగా అందుతారు..." అన్నాడు పెద్ద మనిషి తరహాలో. లేక ఆంధ్రోద్యమం గురించి "అమ్మగారికి" రిపోర్టిచ్చిన మీర్జాపైపులో.

"వెరీగుడ్... చూడూ... నీకు అనిక పావలా యిస్తాను. మంచి రాయొకటి తీసి ఎదురుగా ఒస్తున్నాడే ఆ అబ్బాయిని కొట్టాలి.... పావలా పెడితే ఎన్ని చాక్ లెట్లు అవి వొస్తాయో నీకు తెలుసుకద? కొట్టు" అన్నది జానకి.

చిట్టిబాబు అనుమానంగా చూశాడు.

"ఒట్టు....పావలా యిస్తాను....కావాలంటే మరో అయిదు పైసలు. గభాల్న కానిచ్చెయ్యాలి....నేను తలుపు దగ్గరికి వేసుకుని లోపల నుంచి చూస్తూవుంటాను. రాయి విసిరి కొట్టేసి పారిపోయి మళ్ళీ

---

○ న్యూయార్క్ లో ఉద్యోగం వచ్చింది రామేశానికి. ఇండియన్స్ కు పంక్చ్యాలిటీ తెలవదని ఎక్కడ అమెరికన్ బాస్ అనుకొంటాడో అని పది గంటలకాఫీసయితే తొమ్మిందింబావుకల్లా వెళ్ళాడు. ఆఫీసరుగారి వళ్ళో కూర్చుని కబుర్లు చెబుతోంది ఆయన స్టెనో. మర్నాడు తొమ్మిదిన్నరకల్లాడు వాళ్ళిద్దరూ బిగికౌగిలిలో ఉన్నారు. నెమ్మదిగా తప్పుకోబోయిన రామేశానికి ఆఫీసరుగారి కేక వినపడింది, "రేపు తొమ్మిదీ ముప్పావుకి ఇక్కడ కనిపించావో ఉద్యోగం పీకిపారేస్తా జాగ్రత్త!"

నా దగ్గరకు రావాలి ..ముప్పై పైసలు. వేగిరం ..'' జానకి ఎంకరేజ్ చేసింది.

''ఓ!'' అన్నాడు చిట్టిబాబు. తరువాత రోడ్డుపైపు రాయొకటి తీసి.. ''తగిలితే పూచీలేదు. రాత్రికి రక్తంలేదు'' అనిపాటి ఊచిపెట్టి రాయి విసిరేశు.

ఆ సమయానికి—

మెయిన్ రోడ్డుమీదనుంచి సైకిల్ మీద వచ్చి వీధిలోకిమళ్ళి, చిరంజీవి వెనకాలే సైకిల్ తొక్కుకుంటూ వస్తున్న ఓ బట్ట తల పెద్దమనిషికి ఆ రాయి నుదుటను తగలగా ఆయన క్రిందపడ్డాడు.

''పట్టుకో ... పట్టుకో ...'' కిందపడ్డాయన పారిపోబోతున్న చిట్టిబాబును పట్టుకోమని కేకలేశాడు.

చిరంజీవి చిట్టిబాబును పట్టుకుని తరువాత బట్టతలాయన తాలూకు సైకిల్ లేవనెత్తాడు.

ఆ పెద్దమనిషి నుదురు చిట్లి నెత్తురొస్తున్నది. డైనమో తాలూకు లైట్ చితికిపోయి హేండిల్ వంకరయింది సైకిల్‌కి.

''ఏంరా కుర్రవెధవా బాల సి.ఆర్.పి. రాయెందుకు విసిరేవ్?'' అడిగాడాయన మండిపడుతూ.

''తగిలితే నా పూచీలేదు. రాత్రికి రక్తం లేదు. నేను ముందే చెప్పాను.''

''నోరుముయ్. పద నిన్ను చితకొట్టేస్తాను నన్నెందుకు కొట్టావ్''

''మీకోసం ఏంవిసర్లేదు. ఆ అబ్బాయి కోసం విసిర్తే మీకు తగిలింది'' నిర్లక్ష్యంగా అన్నాడు చిట్టిబాబు.

చిరంజీవికి ఆశ్చర్యం వేసింది. 'నన్నారా! నన్నెందుకూ కొట్టడం?'' చిట్టిబాబు చెవి నులిమేడు చిరంజీవి.

''నిన్ను రాయితో కొడితే ముప్పయి పైసలిస్తానందికదా జానకి!'' విక్కముఖ మేసాడు చిట్టిబాబు.

సైకిలతనికి మతిపోయింది. ''జానకెవరు''


చిరంజీవికి అర్థమయింది. అర్థమయి కోపం వచ్చింది. ''షల్లీ ఇంటివాళ్ళలెండి'' అన్నాడు.

''అయితే '' సైకిలతనికి అర్థం కాలేదు.

''రండి సార్. ఈ దుండగం ఏవిటో తేల్చేద్దాం రోడ్డుమీద మరి ప్రజలెవరూ నడవకూడదుగామోసు .... ఇవాళ ఉత్తి రాళ్ళయాయి. రేపొద్దున తుపాకీ గుళ్ళవుతాయి. షోడాసీసాలవుతాయి. మనం అదేం పోయిందని అనొదిలేస్తే లాభంలేదు. మైనేమీజ్ చిరంజీవీ యువర్ నేమీజ్ వాట్?'' అన్నాడు చిరంజీవి కోపంగా ముందుకు వెళ్తూ.

''నాపేరు రమణమూర్తి! పదండయితే ఆ కుర్రాడ్ని వదిలికండి'' రమణమూర్తి చిరంజీవి సగ్గర్పించి సైకిల్ తీసుకుని ముందుకు కదిలాడు.

''నన్నొదిలేయండి'' చిట్టిబాబు గుంజుకున్నాడు.




"వెర్రిగా వుండమ్మా . డబ్బులొద్దూ నీకా అమ్మాయిస్తానన్న డబ్బులిప్పిం చేస్తా.. తరువాత నువ్వెళ్ళిపోవచ్చు రండి మూర్తిగారూ ఇదే ఆ యిల్లు. స్టేం దెయ్యండి సైకిల్‌కి." చిరంజీవి గుమ్మం దగ్గర నించున్నాడు.

"తలుపు చాటునుంచి చూస్తూ వుంటా నని చెప్పింది" చిట్టిబాబు బెరుకుగా చెప్పాడు.

"చెప్పిందీ ...ఇదేం బుద్ధయ్యా ఆ మనిషికి?" మూర్తిగారు మండిపడ్డారు. తరువాత తలుపుతోసారు.

లోపలగెడ వేసి వుంది.

"తలుపు తట్టండి సార్" చిరంజీవి సలహా ఇచ్చాడు.

మూర్తిగారు తలుపు తట్టేరు. కొంచెం సేపటికో తలుపు తెరుచుకుంది. లోపల నుంచో తల బైటకొచ్చి "ఎవరు కావాలని" అడిగింది.

"జానకంటే మీరే నేమిటి?" మూర్తిగారు కోపంగా అడిగారు.

అతను తలుపు పూర్తిగా తెరిచాడు. "జానకి అంటే నేను కాదు, మా అమ్మాయి. లోపలికి రండి" అతను లోపలికి దారి తీసాడు.

వెనక మూర్తిగారూ, చిరంజీవీ, చిట్టిబాబూ నడిచారు. జానకి తండ్రి కుర్చీలు చూపించి కూర్చోమని తనూ ఓ కుర్చీలో కూర్చున్నాడు.

"మీ అమ్మాయి నొకసారి పిలిపించండి" మూర్తిగారు అడిగారు.

"ఏం? మీరెవరసలు ... ఎందుకు...

ఏం చిట్టీ... నువ్వేనేమిటి తీసుకొచ్చావ్?"

"అదంతా చెబుతానుగాని మీ అమ్మాయిని పిలండి."

"అమ్మాయ్ జానకీ" పిలిచాడాయన.

"ఇక్కడే వున్నాను నాన్నగారూ" తలుపుచాటు నుంచి పలికింది జానకి.

"ముందీ కుర్రాడికి ముప్ఫైపైసలిచ్చి పంపెయ్యండి"

జానకి మాటాడలేదు.

"ఎందుకూ...మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చినందుకు కూలీ ఏమిటి....ఒరే చిట్టీ ఆనక ఇస్తాన్లే" అన్నాడు జానకి తండ్రి.

"అరువల్లేవు" చిట్టిబాబు గట్టిగా అన్నాడు,

"ఇంద" చిరంజీవి అర్ధరూపాయిచ్చి పంపేసేడు.

"ఇప్పుడు ...అయ్యా! నేను ఏమిటి మీ కపకారం చేసాను. తెలుగు సినిమా డైరక్టర్నా, ఆలిండియా రేడియోనా?పోనీ ఏదైనా కాలేజీకి ప్రిన్సిపాల్నా? అసలు నానేంమేమిటి? మీ అమ్మాయి...ఇప్పుడు వెళ్ళిపోయిన కుర్రాడికి ముప్ఫైపైసా లిస్తానన్చెప్పి మామీద మచ్చకొండంతేసి రాళ్లు మామీద విసిరించింది. ఇదుగో నుదురు పగిలిపోయింది. నా సైకిల్ పనే పనికిరాదు. చెప్పండి ఏమిటి మా తప్పు" మూర్తి కర్చీఫ్‌తో వత్తుకుంటూ అన్నాడు.

"అయ్యయ్యో! అదేం మాట...అసలేమిటి జరిగిందో నాకు తెలియటంలేదు" జానకి తండ్రి విచారించేడు.

"అదికాదు నానా... నేను ఈ అబ్బాయి మీద విసర్రా అన్చెపితే, ఆ వెధవ ఈయన మీదకి విసిరినట్టుంది" అన్నది జానకి నెమ్మదిగా.

"అతని మీద మాత్రం విసరవల్సిన పనేమిటి? ఆడపిల్లలు ఇటువంటి రౌడీ పనులు చేయించొచ్చునా?" మూర్తిగారు మండిపడ్డారు.

"నానా · మీరొకసారి లోపలికి రావాలి..." జానకి తండ్రిని పిలిచింది. అతను చిరంజీవి కేసి అనుమానంగా చూసి లోపలికి వెళ్ళేడు.

మూర్తిగారు కుర్చీలో వెనక్కివాలి కళ్లు మూసుకున్నాడు. కొద్ది సేపటిలో లోపలనుంచి జానకి తండ్రి వచ్చేడు.

"మీ అబ్బాయేడండీ?" అనడిగాడు కోపంగా.

"మా అబ్బాయెవరు మధ్య...అతనెవడో నా ముందు నడుస్తున్నాడు. మీ అమ్మాయికీ, ఆ అబ్బాయికీ పరిచయం వున్నట్టుంది...నాకు తెలీదు. అన్నట్టితను ఇక్కడే వుండే వాడేడి చెప్మా..," మూర్తిగారు ఇటూ అటూ చూసేరు. చిరంజీవి కూర్చున్న కుర్చీ ఖాళీగా వుంది.

"ఉరికీ సేడు....దొంగ పిల్లవాడు.... పోల్చిసుంటాడు. మళ్ళీ కనపడనివ్వండి

చెపుతాను. నేనైతే చంపేద్దును. ఆడ పిల్లని అల్లరి పెడతాడా...రౌడీ...హన్నా... కనపడితే చచ్చేడన్న మాటే....అల్లరి కుర్రాడు...కోతిగాడు ...''జానకి తండ్రి మండిపడుతున్నాడు.

"అసలేం చేసేడ..." మూర్తిగారు తటపటాయించి లేచి నిలుచున్నాడు.

"మళ్ళీ కనపడనిద్దరూ చెపుతాను... చమ్డాలెక్కదీసేసేనన్నమాటే..." జానకి తండ్రికి కోపం ఎక్కువవుతూంది.

"మీరు మరీ కోపంగా వున్నట్టుంది... మధ్య నే నెందుకు తప్పుజేసిన అల్లరికోతి పిల్ల వాళ్ళని దండించొచ్చు...తప్పులేదు..: కానీ చూడమ్మాయ్...జానకీ ఈ మారు మరెవరినయినా కొట్టించేప్పుడు రూపాయీ అర్థాలెక్కువయినా బాగా గురిచూసి కొట్ట వలసిన వాళ్ళనే కొట్టించు.... నే వెళ్లొస్తాను." మూర్తి బయటకి నడిచారు. •

---

ముకుందానికి విసుగొచ్చింది. ఎంతకీ బస్ రాదు. వచ్చిన బస్ ఖాళీ లేదు. హేమామాలిని మించిన అందగత్తె పొడుగాటి కార్ నడుపుకొంటూ వచ్చి ముకుందం ముందు ఆగింది 'లిఫ్ట్ కావాలా?' అంది. ఎగిరి గంతేసి వెనుక డోర్ తలుపులు తియ్యబోతున్న ముకుందం ముగ్ధుడయ్యాడు' ముందు కొచ్చి కూర్చోండీ' అన్న కారుకన్య మాటలు విని. అలాగే చేశాడు కూడా. కారు కారులా వెళ్ళడం లేదు పడవలు అటూ యిటూ ఊగుతూ వెళ్తుంది. తన్మయత్వంతో ముకుందం కూడా వూగుతున్నాడు. హఠాత్తుగా ఎదురుగా వచ్చే లారీకి గుద్దుకోబోయిన కారు ఎలాగో తప్పించుకొంది. ఊగులాట పోయి వణుకు పట్టుకొంది ముకుందానికి. 'చూడండీ కొంచెం నెమ్మదిగా పోగూడదూ' అన్నాడు, కారుకన్య నవ్వి 'పీకలదాకా తాగి కారు నెమ్మదిగా తోలడమేమిటి నాన్సెన్స్' అంది. ముకుందం సగం ప్రాణాలు పోయాయి. 'పోనీ కొంచెం కారు ఆపితే ముందు పక్క అద్దం తుడుస్తాను. కొంచెం దారి క్లియర్‌గా కనిపిస్తుంది'' అన్నాడు. "లాభంలేదు. కళ్ళజోడు లేంది చూపు సరిగా ఆనదు'' అందామె. ముకుందం ఆమెవంక చూశాడు. కళ్ళజోడు లేదు. అంతేకాదు "అవునోయ్ గుర్నాథం పార్టీకి రాలేదేమిటి" అని తనవంక తిరిగి అన్నమాటలకు ప్రాణంలో ప్రాణం లేదు. ఆ తర్వాత అయిదు నిమిషాలకు కారు పెద్ద మలుపు తిరగబోవటంతో అతనిలో పూర్తిగానే ప్రాణం లేదు!